సింగిల్ పేజీ కథ



# టిక్‌టిక్ ట్వెంటీట్వెంటీ

## వికటకవి

రిక్కీపాంటింగ్ పరుగెత్తుకెళ్లి ఇషాంత్‌శర్మను కౌగిలించుకున్నాడు. సిమ్మండ్స్, వివిఎస్ లక్ష్మణ్‌లు సంబరాలు చేసుకుంటున్నారు. హర్భజన్‌సింగ్ ఎగిరి గంతేసి, షాన్ పోలాక్‌ను గాల్లోకి ఎత్తేశాడు. ఇదంతా చూస్తున్న బ్రిలియెంట్ బ్రిజేష్ బుర్రలో, బ్రిలియంట్ ఆలోచన మెదిలింది. ఆలోచన వచ్చిన వెంటనే ఆచరణలో పెట్టేయటం బ్రిజేష్ ప్రత్యేకత. అందుకే అరగంటలో మిత్రులందరితో సమావేశమయ్యాడు.

అతడు చెప్పింది విని అతడి మిత్రులంతా పకపకా నవ్వారు. పొట్టలు పట్టుకుని మరీ నవ్వారు. క్రిందపడి పొర్లిపొర్లి పొర్లుతూ నవ్వారు.

**'ట్వంటీ ట్వంటీ పంథాలో సాగే ఈ పోటీలను 'టిక్‌టిక్ ట్వంటీ' పోటీలంటారు. ఈ పోటీల్లో దేశ విదేశీ ఆటగాళ్లతో పాటు, వివిధ దేశాధ్యక్షులు కూడా పాల్గొంటారు. ప్రత్యర్థి ఆటగాళ్లను ఒక జట్టులో ఆడించటం వల్ల వాళ్ల మధ్య స్నేహం సాధ్యమయింది.**

'ఇది సాధ్యంకాదు. కానీ, సాధ్యమయితే సూపర్‌గా ఉంటుంది' అన్నారు నవ్వుతూ.

'సాధ్యం కాదని సాధ్యం కాకపోయేంతవరకూ తెలియదు. ప్రయత్నిస్తే అసాధ్యమయినదేదీ లేదు. పదండి స్పాన్సర్ల దగ్గరకు వెళ్దాం' అన్నాడు బ్రిజేష్ ఉత్సాహంగా.

మరునాడు ఓ పెద్ద వ్యాపారిని కలిశారు. 'పెట్టుబడికి పది రెట్లు సంపాదించగలగటమే కాక ప్రపంచవ్యాప్తంగా పెద్ద పేరు వస్తుంది' ఆయనను ఒప్పించాలని ప్రయత్నించాడు బ్రిజేష్.

వీళ్ల ఆలోచన విని ఆయన ఆలోచించాడు. 'సాధ్యమా?' అడిగాడు.

'మీరు ఊఁ అనండి. నేను సాధ్యం చేస్తా. ఇప్పుడు ప్రపంచంలో వ్యాపారులు శాసించనిది ఏదీ లేదు. సాధించలేనిది ఏదీ లేదు' విశ్వాసం ఉట్టిపడుతూండగా అన్నాడు.

'నువ్వు అందరినీ కలసి కో ఆర్డినేట్ చేసేట్టయితే సరే' అన్నాడా వ్యాపారి.

ఆ తరువాత రెట్టించిన ఉత్సాహంతో మరో పదిమంది బడా వ్యాపారులను కలిశాడు. వాళ్లందరినీ ఒప్పించాడు. అందరూ అతడి ఆలోచన విని ఆశ్చర్యపోయారు. సాధ్యమయితే 'అద్భుతం' అని ఆనందించారు. వాళ్లందరి దగ్గర డబ్బులు అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. ఆ డబ్బులు తీసుకుని బిసిసిఐ అధ్యక్షుడిని కలిశాడు. తన పథకం వివరించాడు. స్పాన్సర్‌షిప్పులు చూపించాడు.

ముందు బిసిసిఐ అధ్యక్షుడు బ్రిజేష్ మాట వినలేదు. విన్న తరువాత నమ్మలేదు. నమ్మిన తరువాత ఇక ఆగలేదు. వెంటనే పనులు ప్రారంభించాడు.

మరుసటి రోజు బ్రిజేష్ పెద్ద ప్రెస్ కాన్ఫరెన్స్ పిలిచాడు.

'ప్రపంచంలో ఇంతవరకూ కనీవినీ ఎరుగని ఆటల పోటీ ఇది. విశ్వశాంతి కోసం ఆడే 'విశ్వకప్' పోటీ ఇది. 'ట్వంటీ ట్వంటీ' ఆటలను ప్రపంచ శాంతికోసం అంకితం చేస్తున్నాం. ఆటలు నిర్వహించే మహత్తర లక్ష్యసాధనకే ఈ పోటీలు' గర్వంగా ప్రకటించటం ప్రారంభించాడు బ్రిజేష్.

అందరూ చకచకా రాసుకుంటున్నారు. టీవీ ఛానళ్లన్నీ ప్రసారం చేస్తున్నాయి. 'ట్వంటీ ట్వంటీ' పంథాలో సాగే ఈ పోటీలను 'టిక్ టిక్ ట్వంటీ' పోటీలంటారు. ఈ పోటీల్లో దేశ విదేశీ ఆటగాళ్లతో పాటు, వివిధ దేశాధ్యక్షులు కూడా పాల్గొంటారు. ప్రత్యర్థి ఆటగాళ్లను ఒక జట్టులో ఆడించటం వల్ల వాళ్ల మధ్య స్నేహం సాధ్యమయింది. అలాగే, ప్రత్యర్థి నేతలను ఒక జట్టులో ఆడించటం వల్ల వాళ్ల మధ్య సంఘీభావం నెలకొంటుంది. ఒకరికొకరు అర్థమౌతారు. ప్రపంచశాంతి సాధ్యమౌతుంది. అందుకే, జార్జ్‌బుష్, పుతిన్, ఒసామా బిన్‌లాడెన్‌లు ఒక జట్టులో ఉంటారు. ఎల్కే అద్వానీ, సీతారాం యేచూరి, మన్మోహన్‌సింగ్‌లు ఒక జట్టులో ఉంటారు. చంద్రబాబునాయుడు, కెసిఆర్, వైయస్ఆర్‌లు ఒక జట్టు. మాయావతి, ములాయం, రాహుల్ గాంధీలదొక జట్టు. పాలస్తీనా, ఇజ్రాయెల్, ఇరాన్ అధ్యక్షులొక జట్టులో... లాలూ, నరేంద్రమోడి, సోనియాలదో జట్టు... ఊహించండి... కెసిఆర్ గుగ్లీ బౌలింగ్ చేస్తుంటే స్లిప్‌లో వైయస్ఆర్... షార్ట్‌లెగ్‌లో చంద్రబాబు...

బుష్ బౌలింగ్‌లో పుతిన్ క్యాచ్ పడితే, ఒసామా ఎగిరి గంతేసి ఇద్దరినీ కౌగలించుకుని ఎగుర్తున్న దృశ్యం ఊహించండి...

ఈ పోటీలు 'సూపర్ సక్సెస్' అని చెప్పాల్సిన అవసరం లేదు కదా!